

# శత్రువు

రమణజీవి




నా ఎనిమిదేళ్ళ వయసులో మొదటిసారి శత్రువును చూశాను. అంటే మూడో తరగతిలో అన్నమాట. నిజానికయితే నేను ఆ దారిలో కూడా వెళ్ళకూడదు. ఇంకా చెప్పాలంటే వాళ్ళింటివేపు కూడా చూడకూడదు. కానీ ఎందుకో పొద్దున దగ్గర దారని ఆ సందుగుండా వెళ్ళాలనిపించింది. దగ్గరి దారి అనేది నన్ను నేను మభ్యపెట్టుకోడానికి కల్పించుకున్న ఒక కారణం మాత్రమే. నిజానికి ఒక ఆపుకోలేని కుతూహలం నన్నా వీధిలోకి లాక్కెళ్ళింది.

ఎప్పటినుంచో మా యింట్లో అందరూ చెబుతూనే వున్నారు. ఆ వీధిలోకి వెళ్ళకూడదని. ఎందుకో తెలిసేది కాదు. కానీ నిన్న మా గంగవ్వ అక్కడ నివసించే ఆరేళ్ళోడు అనే మా శత్రువు గురించి వివరంగా చెప్పింది. అతడు ఎంత దుర్మార్గుడో, ఎంత బరితెగించిన వాడో కళ్ల ముందు సినిమా వేసినట్టు వివరించింది.

ఓసారి వెనక్కి తిరిగి చూసి మా వాళ్లెవరూ చూడ్డం లేదని భరోసా కుదిరాక గభాలున ఆ సందులోకి తిరిగేశాను. ఎగుడు దిగుడుగా వున్న మట్టి రోడ్డు ఇరుగ్గా, రాత్రి కురిసిన వానకు గుంటల్లో నిలిచిన నీళ్ళు, నీళ్ల మీద అక్కడక్కడా తేలుతున్న నానిన బీడీ ముక్కలు... నల్లటి చివర్లతో నాకు వాటిని చూస్తేనే కంపరం. అవి నా పాదాలకెక్కడ తగులుతాయోనని జాగ్రత్తగా చూసుకుంటూ అడుగులు వేస్తున్నాను.

వేపచెట్టు పక్క ఇల్లే అని చెప్పింది గంగవ్వ. వేప చెట్టును సమీపిస్తూంటే కొంచెం కొంచెంగా బయటికొస్తోంది, కొంచెం లోపలికి వున్న ఆ యిల్లు. ఓరగా ఆ యింటివేపు చూశాను. వెలిసిపోయిన మిద్దె. గోడల మీద అక్కడక్కడ పాచి, ఎంత అసహ్యంగా వుందో! అరుగు మీద కూచుని కాళ్లూపుకుంటూ బొగ్గుతో పళ్లు తోముకుంటున్నాడు మా శత్రువు. పెదాల చివర్ల నించి నల్లటి బొగ్గు చారలు ఒకటి పొట్టిగా ఒకటి పొడుగ్గా కారుతూ. మా అవ్వ అతణ్ణి 'ఆ ఆరేళ్ల నా కొడుకు' అంది. ఆరేళ్లోడంటే నా కర్థం కాలేదు. అదొక పేరేమో అనుకున్నా.

అదృష్టం! ఆరేళ్లోడు నా వేపు చూళ్లేదు. నేల మీద జొన్నల్ని ఏరుకు తింటున్న కోడిపిల్లల వేపు చూస్తున్నాడు.

అతడి కళ్లు ఎలా వుంటాయో గానీ ముక్కు కాస్త పొట్టిగా వెడల్పుగా వుంది. తెల్లటి మల్లు పంచ, బుజాల వరకు వున్న చేతుల సైన్‌బనియన్, గుడ్డలయితే మామూలు మనుషుల్లాగే వేసుకున్నాడు. మోకాళ్ల పైకి మడిచి కట్టుకున్న పంచ లోంచి బయటికి వచ్చి వూగుతున్న కాళ్లు మాత్రం నల్లగా భయంకరంగా వున్నాయి. కేవలం గుడ్డల్తో ఎవరూ తమ నిజ రూపాన్ని దాచుకోలేరని అనిపిస్తుంది ఎవరికైనా ఆ క్షణంలో వాణ్ణి చూస్తే. అతణ్ణి దాటిపోతున్న చివరి క్షణంలో నా కంటబడింది అతడు పళ్లు తోముకుంటూంటే చిటికెన వేలికి చిన్ని దొండకాయలా వూగుతున్న మరో చిన్నవేలు. ఓహో! ఇదన్న మాట సంగతి. అతడి కుడిచేతికి ఆరు వేళ్లున్నాయి. చాలా గొప్ప విషయం కనుక్కున్న ఆనందంతో వుషారుగా రోడ్డు మీద నీళ్ల గుంటని కుడిపాదంతో ఈడ్చి తన్నేను.

"ఏం పొయ్యేకాలమొచ్చిందిరా. నా బట్టా...." ఎదురుగా వున్న ముసిలిదాని తిట్లని ఏ మాత్రం లెక్కచెయ్యకుండా ఎగురుకుంటూ పలకని చంకతో గట్టిగా పట్టుకుని స్కూలు వేపు పరిగెత్తాను, నీళ్లని పువ్వులుగా చిందిస్తూ.

అసలు నేను స్కూలుకి నాకై నేను రావడం ఈ మధ్యే.

మూడో తరగతి వరకూ ఇద్దరో ముగ్గురో పిల్లలొచ్చి నా కాళ్లూ చేతులూ పట్టుకుని ఈడ్చుకెళ్లే వాళ్లు, ఒకపక్క నేను వధ్యస్థలానికి తీసుకెళుతున్న మేకపిల్లలా విలవిలాలాడుతుంటే. స్కూలు ఇప్పుడిప్పుడే అలవాటవుతోంది. అదీ రాయుడు సారు వల్ల. ఆయన్ని చూస్తే నా మనసుకు మజ్జిగ తాగినట్టుంటుంది. పిల్లల్ని ఎంత కొడితే అంత గొప్ప టీచర్! ఫేము బెత్తపు దెబ్బలు, తొడపాశాలు, కోదండం వేయడం, కిందమంట పెట్టడం, గోడ కుర్చీలు, బండలు మోయిస్తూ వీధుల్లో తిప్పడం లాంటి శిక్షలు వేసే టీచర్లను కింగులుగా చూసే ఆ రోజుల్లో రాయుడులాంటి టీచరు నాకు భగవంతుడిలా దొరికాడు. స్కూలుకు వెళ్లాలనిపించేలా చేశాడు.



సాయంత్రం వచ్చేటప్పుడు శత్రువు ఇంటి మీదుగానా లేక మామూలు దారిలోనా అని ఎటూ తేల్చుకోలేక హెడ్డండ్ టైలేస్తే మామూలు దారే వచ్చింది.

పైకి రోజులాగే ఇంటికొచ్చినట్టు అనిపించింది. కానీ లోపల మటుకు ఆ పాచిపట్టిన డాబా ఇల్లు, బొగ్గు చారల ఆ ఆరేళ్లోడు, పంచలోంచి నల్ల మొద్దు లాంటి మోటు తొడలు, మరపుకు రావడం లేదు.

చాపా, పలకా, పెద్ద బాలశిక్ష తీసుకుని మిద్దె మీదికి చేరుకున్నాను. వెల్లకిలా పడుకుని పైకి చూశాను. ఆకాశం నిండా వర్షాకాలపు ముదురు మబ్బులు. వాటిని రాసుకుంటూ ఎగిరిపోతున్న తెల్లటి కొంగల వరుసలు. అల్లాంటి దృశ్యాలు చూస్తే పుర కలేసే నా మనసు ఎంతో స్తబ్దంగా ముడుచుకుని వుంది. కారణం నా మనసంతా ఆరు వేళ్లతో నిండి పోయింది. లేచి కూచుని బుక్కు తెరిచాను. వూహూ! ఒక్క ముక్కా ఎక్కడం లేదు తల్లోకి. కాళ్లను మడిచి రెండు చేతుల్తో చుట్టేస్తూ గడ్డాన్ని మోకాళ్ల మీద గట్టిగా ఒత్తుకుంటూ కూచున్నాను. కాళ్ల వేళ్లు అసహనంగా ముడుచుకుంటూ, విప్పుకుంటున్నాయి.

శత్రువులకు ఆరువేళ్లు వుంటాయనే విషయమైతే తెలిసింది. కానీ అసలు శత్రువులు ఎందుకుండాలి? అందరూ మనుషులే వుండొచ్చుగా. ఒక శత్రువును కలిగి వుండడంలో వుండే ఇబ్బందిని నేను పొద్దున్నించీ అనుభవిస్తున్నాను. లోపల ఓ కంపచెట్టు మొలిచినట్టుంది. పలకని దూరంగా కాలితో తన్ని లేచి నిలబడ్డాను.

ఏమీ తోచడం లేదు. లోపలంతా అసహనంగా వుంది.

మా వూళ్లోకి కొత్తగా వచ్చిన కరెంటును గుర్తు చేసుకున్నాను. వీధుల్లోకొచ్చిన కరెంటు ఇంకా ఇళ్లల్లోకి రాలేదు. కరెంటు స్తంభాలు నాటిన ఆ వారం రోజులూ వాటిని కళ్లు విప్పార్చుకుని చూడ్డం తప్ప మరో పని లేదు నాకు.

మిల మిల మెరిసే ఆ తీగ చుట్టలు, సిమెంట్ దిమ్మల్లో ధీమాగా నిల్చున్న కరెంటు స్తంభాలు, స్తంభాల మీద అడ్డంగా తీగెల్ని ఒంటికి చుట్టుకుని మెరుస్తున్న కాకుల్లా కూచున్న ఓ నాలుగు పింగాణీ ముద్దలు.

ఒక చిమ్ని తుడవడం లేదు. ఒక కిర్సనాయిల్ పొయ్యడం లేదు. ఒక అగ్గిపుల్ల అవసరం లేదు.

అలా వెలిగిపోయే మంత్రం కరెంటు.

మిద్దె చివరికి వచ్చి పక్కింటి కేసి తొంగి చూశాను. పక్కింటోళ్లు కరెంటు పెట్టించుకున్నారు. వాళ్లింట్లోంచి బయటి దాకా చాప పరిచినట్టు పడుతోంది వెలుతురు. ఆ చాప మీద నిలబడ్డం నాకు ఎంతో సరదా. ఆ వెలుతురు వేపు కాసేపు తదేకంగా చూశాను. రోజులా వెళ్లి నిలబడాలనిపించ లేదు. ఇంకేదో కావాలి నాకు.

ఓ నాలుగుసార్లు మిద్దె మీదికీ, కిందకీ ఎక్కి దిగేను.

అసలు నేను వాళ్లింటి వేపు వెళ్లి పెద్ద పొరపాటే చేశాను. వెళ్లకుండా వుండాల్సింది. పదేపదే అనుకున్నాను.

మా అమ్మ ఇప్పుడే వంట మొదలెట్టినట్టుంది. పొగకు కళ్లు మండుతున్నాయి. మా గంగవ్వ బయట అరుగు మీద పెరుగు పోసే సిద్దమ్మతో ఏవో ముచ్చట్లు పెట్టుకుంది. ఝాన్సీ లక్ష్మీబాయి మా అవ్వగా పుట్టిందేమో అనిపిస్తుంది నాకు అప్పుడప్పుడు. మహా తెగువ! ఎవర్నో వుంచుకున్నాడని మొగుణ్ణి కూడా ఇంట్లోంచి గెంటించేసింది కొడుకుతో కలిసి. నిజానికి ఎవరో ఒకర్ని వుంచుకోని మగోడు మా వూళ్లోనే లేడు. ఏం చేస్తాం? మా తాత రాత.

తల్లో ఏవో ప్రాణులు ఈదుతున్నట్టుగా వుంది. ఏదో చెయ్యాలి. వేటినన్నా పగలకొడితే? పోనీ ముందు రూములో వున్న వడ్ల మూటలు ఎక్కి దూకడానికి లేదు. తంతారు ఇంట్లో. ఈ మధ్యే ఒక సారి చెయ్యి విరిగి ఇప్పుడిప్పుడే అతుక్కుంది. ఏం చెయ్యాలి? ఏదో ఒకటైతే ఖచ్చితంగా చెయ్యాలి.

ద్వారబంధానికి పైన వున్న గూటి వేపు చూశాను. పిడికిళ్లని నిక్కరు జేబుల్లోకి గట్టిగా దూర్చి అసహనంగా తిప్పుతూ. అందులో వున్న నల్ల బ్యాగు, దాని కింద కాగితాల దొంతరలు నన్ను ఆకర్షించాయి.

అంతెత్తులో వున్నాయంటే కింద దొరకనిదేదో అక్కడ దొరకొచ్చు.

అటూ ఇటూ చూసి గది తలుపు ఎక్కి బ్యాగ్ తీసుకుని కిందికి దిగాను. మా పెద్దక్క అప్పుడే చిమ్నీ తుడుస్తోంది. లాంతరు వెలిగించిందాకా ఆగి ఆమె వెళ్లిపోగానే వెలుతుర్లోకొచ్చి బ్యాగులోంచి కొన్ని కాగితాలు బయటకు తీసి కుతూహలంగా చూశాను. అవేవో దస్తావేజులు. ముదురు ఆకుపచ్చ రంగులో రూపాయి నోట్ల మీద వుండేలాంటి డిజైన్లతో చూడ్డానికి బాగానే వున్నాయి.

మళ్లీ పైకెక్కి అవి అక్కడే వుంచేసి మొత్తం కాగితాలన్నీ పైకెత్తి అడుగున చూశాను.

నా కళ్లు జిగేల్మన్నాయి.

పిడిబాకు! తగరం కాగితాల్తో చేసింది కాదు.


సినిమాల్లో కాకుండా నిజంగా చూడ్డం ఇదే ఫస్ట్‌టైం. వుత్సాహంగా చేతిలో తీసుకున్నాను. మసక వెలుతుర్లో కూడా చంద్రవంకలా మెరుస్తోంది. స్టీలుతో చేసినట్టుంది. వేలితో పదును చూశాను. బ్లేడులా వున్నాయి రెండంచులూ! పిడి చివర అర్థచంద్రాకారంలో ఒంగి వుంది, చేతిలోంచి జారిపోకుండా. దాన్ని బుగ్గకు ఆనించుకున్నాను. చల్లగా వుంది.

పక్కనే ఒక చిన్న పుస్తకం. అట్ట మీద పేరు చూస్తే వాత్స్యాయన కామ సూత్రాలు! పుస్తకం తెరిచాను. ఏవో రాతలు. మధ్య మధ్య కొన్ని బొమ్మలు! ఆడా మగ. ఎందుకు ఇన్ని తిప్పలు పడుతున్నారు వీళ్ళు అనిపించింది. తప్ప నాకేమీ అర్థం కాలేదు. పైగా ఆ బొమ్మల ఆకారాలు కూడా అంతంత మాత్రమే. బొమ్మలంటే వడ్డాది పాపయ్యవే బొమ్మలు! చందమామ కోసమే సగం బతికిన రోజులవి.

ఆ రెండిట్నీ యథాస్థానంలో వుంచేసి వుత్సాహంగా కిందికి దూకేను.

ఇప్పుడు స్థిమితంగా వుంది.

ఆ మెలిగిరిగిన బాకు ఆరేళ్లోడిని చంపడానికే అయి వుంటుంది. అయినా శత్రువంటే ఖచ్చితంగా



చంపాల్సిన వాడేనా? నిజానికి చంపడమయితే చాలా అవసరమే! శత్రువుల్ని, పులుల్ని, పాముల్నీ చంపక ముద్దు పెట్టుకుంటారా ఎవరైనా?

అయితే ఆ బాకు, ఆ పుస్తకం పక్కపక్కనే వుండటం, అందులో దస్తావేజుల కింద దాగి వుండటం నాకెందుకో చాలా చాలా వింత అనుభూతి కలిగింది. అట్లాంటి అనుభూతిని కవిత్వమనే మాజిక్ ద్వారా కూడా పొందొచ్చని తర్వాత తెలిసింది.

పిడిబాకు... పుస్తకం.

ఆ రెండిటికీ ఏమిటి సంబంధం? చాలాసేపు ఆలోచించాను. ఆ రెండూ వేరే వేరే అని కనిపెట్టాను.

పోనీ రెండిటికీ ఏమిటి పోలిక?

దాచిపెట్టడం ఒక్కటే రెండింటికీ పోలిక బహుశా.

****

ఆ మరునాడు

మామూలు దారిలో వెళుతున్న వాడినాల్లా ఏమయిందో తెలీదు అప్రయత్నంగా ఆ సందులోకి తిరిగాను. ఇది మాత్రం ఖచ్చితంగా అనుకోకుండా జరిగిందే. వెనక్కి పోదామంటే మనస్కరించక ముందుకే నడుస్తున్నాను ఏమయినా కానీ అని.

ఆ యిల్లును సమీపిస్తున్నాను. చూపును పొడుగాటి కర్రలా మార్చి నడుస్తున్నాను, ఏమాత్రం అటూ ఇటూ బెసకకుండా.

నిన్న గుర్తించలేదు గానీ ఏదో వికారమైన వాసన కూడా వుంది ఆ యింటికి. ముక్కుకు తెలిసిపోతోంది. ఆ యిల్లు దాటుతున్న విషయం.

అమ్మా! దాటేశాను. చొక్కా గుండీలు విప్పి గుండెల మీద మూడు సార్లు ఉమ్ముకున్నాను.

సాయంత్రం ఇంటికొచ్చేటప్పుడు టాస్ వేసే అవసరమే రాలేదు. ఎందుకంటే ఆ దారి శాశ్వతంగా మూసుకుపోయింది నా మనసులో.

****

అయితే నా నిర్ణయం ప్రకారమే అన్నీ జరగవని ఆ మరునాడే అర్థమయింది. నాలో నేనొక్కణ్ణే కాదు వుండేదని కూడా.

పొద్దున్నించి ఆపుకోలేని ఆకర్షణేదో నన్ను ఆ ఇంటివేపు లాగుతోంది. ఆ ఆరేళ్లోణ్ణి ఇంకా స్పష్టంగా చూడాలని, గొంతు ఎలా వుంటుందో వినాలని గాఢమైన కోరిక. అయితే ఈ కోరిక వల్ల కలిగే భయాన్ని, ఆందోళననీ స్వీకరించడానికి సంసిద్ధంగానే వుంది నా మనసు. అసలు నా కోరిక భయాన్ని అనుభవించడమేమోనని కూడా అనిపిస్తోంది.

ఇల్లు సమీపిస్తోంది. ఓరకంట గమనిస్తున్నాను. ఈ రోజు అతడు రోడ్డు వేపుకి వీపు పెట్టి వేపమండలు తెంపుతున్నాడు. బనియన్ లేదు. నల్లటి వీపు మీద మరింత నల్లగా గొంగళిపురుగుల్లా దట్టంగా వెంట్రుకలు. కొంచమే కనిపిస్తున్న చెంపమీద పెన్సిల్ ములుకుల్లా గడ్డం. చేతుల కదలికలకు అనుగుణంగా అతడి జబ్బలకండలు కొండచిలువల్లా మసులుతున్నాయి. అతడి వీపును సమీపించాను. ముక్కిపోయిన ఎండు మాంసం వాసన! ఆ ఘాటుకు తుమ్ము రాబోయింది.

దాటుతూంటే గట్టిగా అరిచాడు. ''రేయ్'' అని. అతడి గొంతులో పెద్ద చెట్టు మధ్యకు విరిగిన శబ్దం! ఉలిక్కిపడ్డాను. అటు తిరిగి వున్నాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే నా గుండె ఆగిపోయేదే. ఆరేళ్ల వాళ్లబ్బాయి ఇంట్లోంచి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

వొణుకుతున్న కాళ్లతో నడక వేగం పెంచాను.

స్కూల్లో పేరుకి కూచున్నానే కానీ ఆ ఆరేళ్లోడి ఆలోచనలు జలగల్లా వదలడం లేదు. ఉక్కులాంటి వాడి వీపులోకి ఆ పిడిబాకు దిగుతుందా అసలు? వీణ్ణి మా నాన్న ఎలా చంపబోతున్నాడు. ఎందుకంటే మా నాన్న వీడిలో సగం వుంటాడు బక్కగా. బక్కగా వున్నా తెలివీ, చురుకూ వున్న మనిషి మా నాన్న. బహుశా పొట్టలో పొడుస్తాడేమో. అక్కడ కాస్త మెత్తగా వుంటుందిగా. వాడి గొంతు గుర్తొచ్చింది. సన్నగా వొళ్లు జలదరించింది. ఒంట్లోని




శక్తంతా ఆవిరైపోతున్నట్టుంది. కాసేపు పాఠం వినడానికి ప్రయత్నించాను. అట్లనా వాణ్ణి మరచిపోవచ్చని. వూహూ! ఏం లాభం లేదు.

గంట గణాగణా మోగింది. గంటంటే వేలాడదీసిన ఓ రైలు పట్టాముక్క. ఒక సుత్తి. దాన్ని కొట్టే పని చేసే ఈశ్వరయ్యంటే మాకు ఎంత ప్రాణమో!

నాకు చాలామంది చేసే అనేక పనులు తెలుసు. పర్వి వాళ్ల నాన్న చేసే డిప్యూటీ తాసీల్దార్ వుద్యోగం దగ్గర్నించి మా నాన్న చేసే చీరల వ్యాపారం వరకు ఏవీ నచ్చవు. పెద్దయ్యాక నేనయితే సంతోషం కలిగే పనులే చేస్తాను. ఏవైనా కొత్తవి కనిపెట్టాలి, అంటే ఆలోచించడం. అంటే సంతోషం. లేదా ఈశ్వరయ్యలాగా ఇతరులనన్నా సంతోషపెట్టాలి.

పిల్లలంతా తుట్టెను కదిల్చిన తేనెటీగల్లా లేచారు. గోలగోలగా అరుస్తూ, నేను మెల్లిగా లేచి నిలబడ్డాను.

ఏ దారిలో వెళ్లాలో నిర్ణయించుకునే శక్తి కూడా లేదు. ఎవరో నడిపిస్తున్నట్లు నడుస్తున్నాను. బురదలో పడుతున్నట్టు పడుతున్నాయి అడుగులు.

ఆరేళ్లోడి ఇంటివేపు తలతిప్పి చూశాను.

ఇప్పుడు నాకు భయపడే ఓపిక కూడా లేదు.

వాడు ఇంకొకతను కలిసి నులక మంచాన్ని అల్లుతున్నారు. మధ్యలో నులక కండెను అందిస్తూ వాడి కొడుకు సహాయం చేస్తున్నాడు.

మంచం అల్లాలంటే నలుగురు ఖచ్చితంగా వుండాలట. నలుగురుంటే మంచం కుక్కలాగా చిక్కుతుందట. లేకపోతే కుక్కల్లాగా తన చుట్టూ తిప్పుకుంటుందట. మా గంగవ్వ చెప్పింది. అంత నీరసంలో కూడా పని చెయ్యడం మానలేదు నా తల.

''కోడెత్తి దూర్పరా కోతినాయలా'' ఆరేళ్లోడి గొంతు ఉరిమినట్టే వుంది.

ఒక భయపు తెర నాలో అలా పాకి వెళ్లిపోయింది.

లేని శక్తిని తెచ్చుకుంటూ గబగబా నడుద్దామనుకున్నాను. కానీ అడుగులు తడపడుతున్నాయి. పడిపోయేట్టున్నాను.

ఇంటికెళ్లి పలకా పుస్తకాలు గూట్లో పడేసి అరుగు మీద పడుకున్నాను నిశ్శబ్దంగా. నేను అలా పడుకోవడం చాలా అరుదు. గంగవ్వ ఆత్రంగా నా నుదురు ముట్టుకుని చూసింది ''ఏందిబ్బే'' అంటూ.

''మేయ్ సుబ్బులచ్చుమమ్మా. అబ్బికేందిమ్మే ఇట్ట కాలిపోతాందొళ్లు'' అని కేకేసింది గట్టిగా.

ముద్దరపల్లి ఆయుర్వేదం డాక్టర్ని పిలిపించారు. నీరసంగా నాలుక చాపేను. నాడి చూశాడు. ఆ స్పర్శ చాలా ఇష్టం. జ్వరమొస్తే నాన్‌రొట్టెలు తినొచ్చని మరో ఇష్టం. ఆ డాక్టర్ని చూస్తేనే సర్వరోగాలు మాయమయ్యేటట్టుగా వుంటాడు, ఇస్త్రీ వాసనతో.

ఏవో ఇటిక రంగు మాత్రలిచ్చి పథ్యాలేవో చెప్పి వెళ్లిపోయాడు.

అన్నాన్ని చార్లో మెత్తగా పిసికి తాగించారు. మా నాన్న లేడు వూర్లో. లేకపోతే ఇంకా హడావిడి చేసేవాడు.

ఎందుకంటే మా తాత కుటుంబంలో మా తాత ఒకడే మగపిల్లాడు. మా నాన్న కుటుంబానికీ మా నాన్న ఒక్కడే మగవాడు. అందుకని ఇప్పుడు కూడా నేను తప్ప ఇంక మగపిల్లలు పుట్టరని భయం!

కళ్లు మూసుకుంటే ఆ ఆరేళ్కోడే గుర్తొస్తున్నాడు. నల్లటి వీపు మీద గొంగళిపురుగులు. ముగ్గిపోయిన ఎండుమాంసం వాసన. విరిగిపడుతున్న చెట్లు. రెప్పల్ని బలవంతంగా తెరిచి మా అమ్మను పిలిచాను.

''మా! మనం ఈ వూర్లో వుండొద్దుమ్మా. ఇది గబ్బూరు. పోదామ్మా యాడికైనా. ఆరేళ్లోడుండే వూర్లో మనం వుండొద్దు. మా భయమేస్తోందే. ఆరేళ్లోళ్లు లేని వూరికి పోదాం మా''

''ఇదో తల్లీ! నువ్వే వీడికన్నీ లేనిపోనివి ఎక్కిచ్చేది'' విసుక్కుంటోంది మా అమ్మ మా అవ్వ మీద. లాంతరు వెలుగులో వాళ్లిద్దరి నీడలూ పొడుగ్గా సాగి గోడ మీద కదులుతున్నాయి. కాసేపు ఆ రెండూ ఏదో వాదించుకున్నాయి.

ఆ తర్వాత ఆ రెండు నీడలు కలిసిపోయిన ఒకే ఆకారం వచ్చి నన్ను ఆనుకుని కూచొంది.

వులిక్కిపడి ''ఎవురమ్మో నువ్వు'' అరిచాను ఇల్లు అదిరిపోయేట్టు ఇంట్లో అంతా గాభరాపడ్డారు.

ఇల్లంతా అల్లకల్లోలం అయిపోయింది అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు.

దూరం నించి మా అమ్మ గొంతు.

''ఇయ్యి సంధి చేష్టలే తల్లే. పిల్లోణ్ణి అతలాకుతలం చేస్తాదిమ్మే. చానా శబ్బరమ్మే. బో ముందు నాగన్నను పిల్చుకురాంర్రా నాయనా. పోస్టాఫీసుకు పోయి మీ నాయినకి ట్రంకాల్ పెట్టి రా పోమ్మే''

నాగన్న కోసం మా అవ్వ బయలుదేరింది కడియాలు ఠణ్ ఠణ్‌మనిపిస్తూ.

కాసేపటికి వేపాకు వాసనలు, సాంబ్రాణి పొగలు తెలుస్తున్నాయి. తర్వాత నీరసంగా కళ్లు మూసుకున్నాను.

ఆ రాత్రంతా వొకటే కలలు. రాయుడు సార్‌ను కోదండం వేసినట్టు. కింద ముంత పొగ. వూపిరి తీసుకోలేకపోతున్నాడు సార్. ఒకటే దగ్గు. నేను విలపిస్తున్నాను ''సా..సా..'' అని.

కాసేపటి తర్వాత ఆరేళ్లోడు, రాయుడి సార్‌ని ఎక్కించుకుని సైకిల్ తొక్కుతున్నాడు. ఎక్కడికి పోతున్నారు. రాయుడు సార్‌ని ఎక్కడికి తీసుకెళుతున్నాడు వీడు. ''సా...పోద్దు...పోద్దు సా...దిగుగ సా...వాడు మంచోడు కాద్సా...నిన్ను చంపుతాడు సా...'' కేకలేస్తూ వాళ్లపక్కనే నేను పరుగులు తీస్తున్నాను. నేనెంత పిలిచినా వాళ్లు పలకడం లేదు. నా ఉనికి వాళ్లకు తెలుస్తున్నట్టు లేదు. అలా మగతమగతగా గడిచిపోయింది ఆ రాత్రి.

తెల్లారింది.

నుదిటి మీద చల్లటి స్పర్శకు మెలకువ వచ్చింది.

అప్పటికే లేచిన కాకుల గొంతుల్లో సంతోషం!

ఒళ్లు తేలిగ్గా, హాయిగా వుంది. లోపలంతా కడిగేసినట్టుంది. కళ్లు తెరిచే ఓపికయితే లేదు. చిన్ని చిరునవ్వొకటి లోపల్నించి పొడారిపోయిన పెదాల మీదకు రాబోతోంది.

అంతలోనే ఘాటు వాసన. అదే వాసన! ముక్కి పోయిన ఎండు మాంసం వాసన! నిదానంగా కళ్లు తెరిచాను. ఎదురుగా మా నాన్న నా మీదికి వొంగి ఆదుర్దాగా చూస్తున్నాడు.

నీరసంగా నవ్వేను.

★

